వినాయకుడి తత్వం పృథ్వీమయం

- పర్యావరణ హితం మట్టి విగ్రహం
- మట్టితో తయారు చేసిన విగ్రహాలనే పూజించాలని చెబుతున్న పురాణాలు
- ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాలతో పర్యావరణ కాలుష్యం
- పూజకు కూడా నిషిద్ధమని చెబుతున్న పండితులు



ఆదోనిలో పంపిణీ చేసిన మట్టి వినాయక విగ్రహాలు

గోనెగండ్ల : మట్టి విగ్రహాలు పర్యావహణ హితాలు. వినాయక చవితి రోజున మట్టి వినాయకుడిని మాత్రమే వినియోగించాలి. పూర్వకాలం నుంచి మట్టి గణపతినే పూజించేవారు. మట్టి వినాయకుడినే ఎందుకు పూజించాలంటే వినాయకుడి తత్వం పృథ్వీమయం అని పురాణాల్లో ఉంది. పృథ్వీ అంటే భూమి, భూమిలో లభించే మట్టితోనే ఆయన ప్రతిమను తయారు చేసి పూజించాలని పండితులు పేర్కొంటున్నారు. మట్టితో తయారు చేసిన విగ్రహం ఎక్కువ కాలం ఉండదు కాబట్టి నిమజ్జనం చేయాలని చెప్పారు. గతంలోనూ మట్టి ప్రతిమలనే పూజించారు. అయితే కాలానుగుణంగా ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాలు వాడుకలోకి వచ్చాయి. ఇవి పూజకు నిషిద్ధమని పండితులు చెబుతుండగా.. వీటి వల్ల పర్యావరణం, జలం కాలుష్యమవుతుందని పర్యావరణవేత్తలు హెచ్చరిస్తున్నారు. స్వచ్ఛమైన మట్టితో తయారు చేసిన వినాయకుడి ప్రతిమనే పూజకు ఉపయోగించాలని స్పష్టం చేస్తున్నారు. అందుకే మనం మట్టివినాయకుడిని ప్రతిష్ఠించి పూజించాలి.

మట్టివిగ్రహాలతో లాభాలు

- సహజసిద్ధంగా దొరికే బంకమట్టితో విగ్రహాలు తయారు చేసుకోవడం మంచిది. ఇది నీటిలో సులభంగా కరిగిపోతుంది.
- మట్టివిగ్రహాల నిమజ్జనంతో జల వనరులకు ఎలాంటి నష్టం ఉండదు.
- సహజ సిద్ధమైన చెట్ల ఆకులు, బెరడుతో తయారు చేసే రంగులను మట్టి బొమ్మలకు అద్ది ఆకర్షణీయంగా తయారు చేసుకోవచ్చు.

రసాయనాలతో అనర్థాలు

- ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారు చేసే విగ్రహాలు కుంటలు, చెరువుల్లో నిమజ్జనం చేసినా కరగవు. ఈ విగ్రహాల్లో జిప్సమ్, గంధకం, మెగ్నీషియమ్, పాదరసం, సీసం, కాడ్మియం, ఆర్గానిక్స్, కార్బన్ అవశేషాలుంటాయి.
- ఈ ప్రతిమలకు పూసిన రంగులు నీటిని కలుషితం చేస్తాయి. ఈ నీటిని తాగిన పశువులకు జీర్ణకోశ వ్యవస్థ దెబ్బతింటుంది.
- రసాయనాలు కలిసిన నీటి మూలంగా శరీరంలో నరాలపై ప్రభావం చూపి క్యాన్సర్ వ్యాధికి దారి తీస్తుంది. చర్మవ్యాధులు వ్యాప్తి చెందుతాయి.
- రసాయనిక రంగులు కలిసిన నీరు పంటపొలాల్లో చేరి దిగుబడులు తగ్గించడమే కాకుండా ఆహార ఉత్పత్తులను కలుషితం చేస్తుంది.
- ప్లాస్టర్ పారిస్ నీటిలో కరగడానికి కొన్నేళ్లు పడుతుంది. నీరు, నేల, గాలి అన్నింటిపైనా కాలుష్య ప్రభావం ఉంటుంది.

మట్టి విగ్రహాలే శ్రేష్టం



మట్టి విగ్రహాలే పూజకు శ్రేష్టం. మట్టితో తయారు చేసిన విగ్రహాలనే పూజించాలని పురాణాల్లో కూడా ఉంది. రసాయనాలతో తయారుచేసే పీఓపీ విగ్రహాలను చెరువుల్లో నిమజ్జం చేస్తే ఆ నీరు కలుషితమవుతుంది. ఆ నీటిని పశువులు తాగితే వ్యాధుల బారిన పడతాయి. అటువంటి విగ్రహాలను పక్కన పెట్టి మట్టి విగ్రహాలను వాడడం వలన మానవళికి కూడా ముప్పువాటిల్లకుండా ఉంటుంది. ప్రతి ఒక్కరూ మట్టి విగ్రహాలనే వాడుకోవడం మంచిది. – శివయ్యస్వామి, వీరశైవమఠం పీఠాధిపతి, గోనెగండ్ల

అవగాహన కల్పించాలి



ఇప్పటికే చాలా గ్రామాల్లో రసాయనాలతో తయారుచేసే విగ్రహాలనే వాడుతున్నారు. ముఖ్యంగా అధికారులు అవగాహన కల్పించకపోవడంతోనే ఇలా జరుగుతుంది. పీఓపీ విగ్రహాల వలన జరిగే అనర్థాలపై తెలియజేసినట్లయితే రసాయన విగ్రహాలను వాడకుండా మట్టి విగ్రహాలను చాలా మంది వాడుకుంటారు. అవగాహన కార్యక్రమాలను అధికారులు నిర్వహించాలి. – పూజరి మునిస్వామి, గోనెగండ్ల

మట్టి విగ్రహాలను పూజిద్దాం

ఆదోని సెంట్రల్: కెమికల్స్‌తో కూడిన వినాయక విగ్రహాలను కాకుండా మట్టి విగ్రహాలనే పూజిద్దామని శ్రీ భారతి తీర్థ ఉద్యానవనం కమిటీ సభ్యులు రఘురామయ్య, కృష్ణమూర్తి గౌడు, శివరాం రెడ్డి, హనుమంతరావు, వెంకటేశ్వర్లు, ధనుంజయ రెడ్డి పిలుపునిచ్చారు. తిరుమల నగర్‌లోని భారతి తీర్థ ఉద్యానవనం ఆధ్వర్యంలో కాలనీ వాసులకు సోమవారం మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ కెమికల్స్‌తో కూడిన విగ్రహాలను వాడకం సరికాదన్నారు. నాలుగు సంవత్సరాలుగా మట్టి వినాయకుని విగ్రహాలను పంపిణీ చేస్తున్నామన్నారు. ఈ సంవత్సరం కూడా 600 మట్టి వినాయకుని విగ్రహాలను పంపిణీ చేసినట్లు తెలిపారు. మట్టి విగ్రహాలు కావాలనుకున్న వారికి 26వ తేదీ మంగళవారం కూడా పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. పంపిణీ కార్యక్రమం ఉదయం 6గంటల నుంచి 8 గంటల వరకు సాయంత్రం 5 నుంచి 7గంటల వరకు అందించడం జరుగుతుందన్నారు. మట్టి విగ్రహాలు కావలసిన వారు తిరుమల నగర్‌లోని శృంగేరి శంకర మఠంలో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు గోపాల్, శివప్రసాద్, జయరాముడు, శివుడు, సురేంద్ర రావు, రామాంజినేయులు, గురునాథయ్య తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నీటి వృథాను అరికట్టండి

ఆదోని రూరల్: మండలంలోని గణేకల్ గ్రామంలో పంచాయతీ మోటార్ నుంచి నీరు వృథా అవుతున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు గానీ పట్టించుకోవడం లేదని సీపీఎం మండల కార్యదర్శి కె.లింగన్న, మండల కార్యవర్గ సభ్యులు వీరారెడ్డి ఆరోపించారు. సోమవారం ఎంపీడీఓను కలిసి నీటి వృథాను అరికట్టాలని వినతి పత్రం అందించారు. వారు మాట్లాడుతూ గ్రామంలో పంచాయతీ మోటార్ నుంచి నాలుగు ట్యాంకులకు నీరు అందేవని, సీసీ రోడ్లు, డ్రైనేజీలు వేసే సందర్భంలో పైపులు పగిలిపోవడంతో రెండింటికే పరిమితమవుతూ ఉన్నాయన్నారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ నాయకులు చిన్నవీరేష్, రామకృష్ణ, బంగారయ్య తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు కంప్యూటర్ల విరాళం



కంప్యూటర్లు పంపిణీ చేసిన ఐడీబీఐ సిబ్బంది

ఆదోని సెంట్రల్: కల్లుబావిలోని పురపాలక ఉన్నత పాఠశాలకు ఐడీబీఐ బ్యాంకు వారు కంప్యూటర్లను సోమవారం పంపిణీ చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గిరిబాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కర్నూలు ఐడీబీఐ బ్యాంకు మేనేజర్ నవీన్ కుమార్, ఆదోని బ్రాంచ్ మేనేజర్ రాఘవేంద్ర రెడ్డి, ఏఓ రాకేష్, అసిస్టెంట్ మేనేజర్ రఘు మాట్లాడుతూ ఐడీబీఐ బ్యాంకు సీడ్ ప్రోగ్రాం కింద పాఠశాలకు రూ. 1,50,000లు విలువ చేసే మూడు కంప్యూటర్లు, మూడు టీ బుల్స్, ప్రింటర్, స్పీకర్, బిరువాను విరాళమిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పురపాలక ప్రాథమిక పాఠశాల హెచ్ఎం గంగ నాయక్, ఉపాధ్యాయులు శివకుమారి, కాంతమ్మ, పద్మావతి, సాల్మన్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు కంప్యూటర్, ప్రింటర్ విరాళం

ఆదోని అర్బన్: హనుమాన్‌నగర్‌లోని కిలిచిసపేట మున్సిపల్ హైస్కూల్‌కు పట్టణంలోని శ్రీ మహాయోగి లక్ష్మమ్మ కో ఆపరేటివ్ బ్యాంకు తరపున రూ.60 వేలు విలువ చేసే కంప్యూటర్, ప్రింటర్‌ను అందించారు. ఈ సందర్భంగా బ్యాంకు బీఓఎం చైర్మన్ రాయచోటి సుబ్బయ్య, వైస్ చైర్మన్ బి.లక్ష్మీనారాయణశెట్టి, డైరెక్టర్లు ఎస్.హుసేన్‌అహ్మద్, కె.ఆర్.శ్రీనివాసులు, ఆర్.ఎం. విరుపాక్షిరెడ్డి, బ్యాంకు మేనేజర్ ఎంఎండీ జుల్ఫీకర్ చేతులమీదుగా హెచ్ఎం ఉరుకుందప్పకు అందించారు.

రక్షణ చట్టం ఏర్పాటు చేయాలి

ఆదోని టౌన్: బీసీలకు రక్షణ చట్టం ఏర్పాటు చేయాలని బీసీ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దస్తగిరి నాయుడు డిమాండ్ చేశారు. ఆదోని డివిజన్ బీసీ ఫెడరేషన్ ఆధ్వర్యంలో స్థానిక కార్యాలయంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు దస్తగిరి నాయుడు అధ్యక్షతన రౌండ్‌టేబుల్ సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు ఏర్పాటు చేయాలన్నారు. బీసీ విద్యార్థులకు హాస్టల్ సీటు కల్పించేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో డివిజన్ ఉపాధ్యక్షులు ఢణాపురం శేషన్న, రిటైర్డ్ తహసీల్దార్ పి.షేక్షావలి, బండారి రాజేశ్వరరావు, డాక్టర్ వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ దిద్దుబాటు చర్య

సాక్షి ఎఫెక్ట్

కౌతాళం : మండల పరిధిలోని గుడికంబాలి గ్రామానికి చెందిన పుట్టుకతోనే అంధులైన హనుమేష, నాగమ్మ అన్నచెల్లెళ్ల పింఛన్ తొలగిస్తున్నట్లు నోటీసు ఇవ్వడంపై సోమ వారం 'అంధత్వం కనిపించదా' అనే శీర్షికన సాక్షి దిన పత్రికలో వార్త రావడంతో ప్రభుత్వం, అధికారులు దిద్దుబాటు చర్యలు తీసుకున్నారు. ఇక నుంచి మీ పింఛన్ కట్ కాదు యాథావిధిగా ఇస్తామంటూ సోమవారం సాయంత్రం వెల్ఫేర్ అసిస్టెంట్ నాగరాజు గుడికంబాలిలోని బాధితుల ఇంటికి వెళ్లి గతంలో ఇచ్చిన నోటీసు ఉపసంహరించుకుంటున్నట్లు మరో నోటీసును ఇచ్చారు.

శ్మశాన వాటికలో సమాధుల ధ్వంసం

కోసిగి: మండల పరిధిలోని వందగల్లు గ్రామంలో ఓ వర్గం శ్మశాన వాటికలో సమాధులను ధ్వంసం చేశారు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. చాల ఏళ్ల కాలం క్రితం నుంచి గ్రామంలో 18 సెంట్లలో ఓ వర్గానికి చెందిన శ్మశాన వాటిక ఉంది. జనాభా పెరగడంతో శ్మశానం చుట్టు పక్కల గ్రామం విస్తరించింది. దీంతో గ్రామ పెద్దలు, ఆ వర్గం పెద్దలతో చర్చ జరిపి శ్మశాన వాటిక స్థలాన్ని వదిలేయాలని, అందుకు గానూ గ్రామ శివారులో ఎకరా స్థలం కొనుగోలు చేసి శ్మశాన వాటికకు ఇస్తామన్నారు. ఇందుకు వారు కూడా ఒప్పుకున్నారు. కాగా, సోమవారం కొందరు ఆ శ్మశాన వాటికలోని సమాధులను తొలగించే ప్రయత్నం చేయగా ఓ వర్గం వారు అడ్డుకున్నారు. పెద్దల సమాధులను ఎలా తొలగిస్తారంటూ వాదనకు దిగారు. ఈ పంచాయతీ పోలీస్ స్టేషన్‌కు చేరుకుంది.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు

ఎమ్మిగనూరురూరల్: పట్టణంలో సోమవారం సాయంత్రం విజిలెన్స్ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. విజిలెన్స్ ఏఓ విశ్వనాథ్, కమర్షియల్ టాక్స్ అధికారి వెంకటరమణ, ఏఓ శివశంకర్ మాట్లాడుతూ శ్రీ పంచముఖీ ట్రేడర్స్‌లో అనుమతులు లేని రూ. 47,347లు విలువ చేసే 8 మెట్రిక్ టన్నులు, శ్రీ మానస ట్రేడర్స్‌లో రూ. 2,75,400 ల విలువ చేసే 10.23 మెట్రిక్ టన్నుల ఎరువుల అమ్మకాలు నిలుపుదల చేసినట్లు తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోండి



వృద్ధుడి సమస్యను వింటున్న సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్

ఆదోని రూరల్: ప్రజా సమస్యలను వేగవంతంగా పరిష్కరించాలని, పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసెల్ సిస్టం (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో వచ్చిన అర్జీలను ఏ ఒక్క అధికారి నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసెల్ సిస్టం–పీజీఆర్ఎస్‌లో పాల్గొని డివిజన్‌లోని ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. మండలంలోని ఆయా శాఖల అధికారులకు సంబంధించిన సమస్యలను తెలియజేస్తూ గడువులోపు పరిష్కరించేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ బియాండ్ ఎస్ఎల్ఏలోకి వెళ్లకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ వేణుసూర్య, శ్రీనివాసరాజు, డీఎల్‌పీఓ తిమ్మక్క, గృహ నిర్మాణ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ చంద్రశేఖర్, డిప్యూటీ డీఈఓ వెంకటరమణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వ్యాపారుల తీరుపై రైతుల ఆగ్రహం



రైతులకు నచ్చజెబుతున్న సీఐ శ్రీరామ్

ఆదోని అర్బన్: ఆదోని వ్యవసాయ మార్కెట్‌యార్డుకు తెచ్చిన దిగుబడులకు సాయంత్రం వరకు ధర ప్రకటించకపోవడంతో ఎదురుచూసి విసిగిన రైతులు యార్డు కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. అలాగే అధిక సంఖ్యలో రైతులు వచ్చి యార్డు కార్యాలయాన్ని ముట్టడించారు. ఇప్పటి వరకు ధర ప్రకటన ఎందుకు రాలేదని అధికారులను నిలదీశారు. రైతులు నష్టపోకుండా ఉండేందుకు వేరుశనగ దిగుబడులకు పాసింగ్ చేయకుండా ధర వేయాలని వ్యాపారులకు రెండు రోజుల క్రితం చెప్పామని, సోమవారం నుంచి ఈ నిబంధనలు అమల్లోకి వచ్చిందని అధికారులు తెలిపారు. అయితే వ్యాపారులు టెండర్ వేసి ఆన్‌లైన్‌లో ఎంట్రీ చేయకుండా వెళ్లారని చెప్పడంతో ఒక్కసారిగా రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వ్యాపారులు టెండర్ వేసి ఎంట్రీ చేయకుండా ఇలా చేయడం అన్యాయమని, తాము టెండర్ వేయమని ముందే చెబితే దిగుబడులను తీసుకునివచ్చేరాం కాదని ఆవేదన వ్యక్తం చేశారు. రవాణా ఖర్చులు, దిగుబడులు ఎత్తిపోసే కూలీలు ఎవరు భరిస్తారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతలోపు వన్ టౌన్ సీఐ శ్రీరామ్ యార్డుకు చేరుకుని రైతులకు నచ్చజెప్పారు. యార్డు సెక్రటరీ కల్పన, వేరుశనగకాయల వ్యాపారుతో సీఐ చర్చించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం నడుచుకోవాలని వ్యాపారులకు సూచించారు. రైతులను ఇబ్బందులకు గురి చేయరాదని హెచ్చరించారు. మరో రెండు రోజులపాటు సమయం తీసుకుని ఒక నిర్ణయానికి వచ్చిన తర్వాత వ్యాపారం ప్రారంభించాలని వ్యాపారులకు చెప్పడంతో ఆందోళన సద్దుమణిగింది. అయితే అప్పటికే సాయంత్రం కావడంతో రైతులు తమ వెంట తెచ్చుకున్న సంచుల్లో వేరుశనగ దిగుబడులను నింపి ఆయా దుకాణాల్లోనే పెట్టి వెళ్లిపోయారు.

కఠిన చర్యలు తప్పవు

ఆదోని వ్యవసాయ మార్కెట్‌యార్డులో నియమ, నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, లేనిపక్షంలో కఠిన చర్యలు తీసుకుంటామని యార్డు సెక్రటరీ కల్పన తెలిపారు. ఎక్కడా లేని విధంగా ఇక్కడి వ్యవసాయ మార్కెట్‌యార్డులో పాసింగ్ వ్యవస్థ ఉందని, దీనిని రద్దు చేయడమే ప్రభుత్వ నిబంధన అన్నారు. రెండు రోజుల పాటు వ్యాపారస్తులకు సమయం ఇస్తున్నామని, నిర్ణయించుకుని తమకు చెబితే వేరుశనగ దిగుబడులను యార్డుకు రప్పిస్తామని తెలిపారు. గురువారం రోజున వ్యాపారస్తులతో చర్చించి తుది నిర్ణయం తీసుకుంటామని, కచ్చితంగా పాసింగ్ వ్యవస్థను రద్దు చేస్తామని చెప్పారు.

సబ్ కలెక్టర్ ఆదేశాలు బేఖాతర్




రోడ్డుకు అడ్డగా గుంత తీస్తున్న దృశ్యం

కౌతాళం: అక్కడ ఆ గ్రామ అధికార పార్టీ నాయకుని మాటకు తిరుగలేదు. ఆయన చెప్పిందే వినాలి. సాక్షాత్తు సబ్‌కలెక్టర్ ఆదేశాలను సైతం లెక్కచేయడు. మండల పరిధిలోని బాపురం గ్రామంలో అయ్యప్ప అనే వ్యక్తి డ్రైనేజీ కాల్వకు అడ్డంగా నల్ల బండలు పాతడంతో కాలనీ వాసులు ఈనెల 18న స్పందనలో ఆదోని సబ్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. స్పందించిన సబ్ కలెక్టర్ అడ్డంగా పాతిన బండలను పంచాయతీ అధికారులతో తీయించారు. అయినా అయ్యప్ప సబ్ కలెక్టర్ ఆదేశాలను ఖాతరు చేయకుండా సోమవారం ఏకంగా రోడ్డును తవ్వి బండలు పాతడానికి పూను కోగా.. కాలనీ వాసులు మారెప్ప, మహదేవ, ఈరన్న, సంతోషమ్మ, లక్ష్మన్న, కాంతి, రామాంజినేయులు మరికొందరు అడ్డుపడ్డారు. అయినా అతను లెక్కచేయకుండా తన పని తాను చేసుకున్నాడు. దీంతో గ్రామంలో ఉద్రిక్తత వాతవరణం నెలకొంది. అధికార పార్టీకి చెందిన అనుచరుడు కావడంతోనే పనులను ఎవరూ ఆపడంలేదని కాలనీ వాసులు వాపోయారు.

ఆదోనివాసికి మదర్‌థెరిస్సా అవార్డు

ఆదోని అర్బన్: పట్టణానికి చెందిన బూదూరు శ్రీనివాస్ మదర్‌థెరిస్సా అవార్డును అందుకున్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రావులపాలెం సీఆర్‌సీ ఫంక్షన్ హాల్‌లో సోమవారం మదర్ థెరిస్సా ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో మదర్ థెరిస్సా జయంతిని పురస్కరించుకుని వివిధ రంగాల్లో సేవలు అందిస్తున్న వారికి పురస్కారాలు అందజేశారు. గుడివాడ సీఐ రవణమ్మ, ప్రముఖ శిల్పి, రాజ్‌కుమార్ వడియార్, అన్నా మినిస్ట్రీస్ ఐఈ కుమార్‌ల చేతులమీదుగా అవార్డులు అందించారు.

పింఛన్లను కొనసాగించాలి



ఎంపీడీఓకు వినతి పత్రం అందజేస్తున్న వికలాంగులు

ఆదోని రూరల్: అర్హులైన వికలాంగులందరికీ పింఛన్లు కొనసాగించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కె.లింగన్న డిమాండ్ చేశారు. సోమవారం జాతీయ వికలాంగుల హక్కుల వేదిక ఆధ్వర్యంలో ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం లక్షల సంఖ్యలో వికలాంగుల పింఛన్లు రద్దు చేయాలని నిర్ణయం తీసుకోవడం తగదన్నారు. కార్యక్రమంలో దివ్యాంగుల సంఘం మండలాధ్యక్షులు హనుమంతరెడ్డి, నాయకులు వీరాంజనేయులు, దుగ్గప్ప, సీఐటీయూ మండల కార్యదర్శి బి.వీరారెడ్డి, రైతు సంఘం నాయకులు ఉచ్చీరప్ప తదితరులు పాల్గొన్నారు. అలాగే వికలాంగుల పింఛన్ల తొలగింపును కూటమి ప్రభుత్వం విరమించుకోవాలని డిమాండ్ చేస్తూ వికలాంగుల సంఘం అధ్యక్ష కార్యదర్శులు వెంకటేష్, మల్లయ్య, సీపీఎం కార్యవర్గ సభ్యులు పి.ఎస్.గోపాల్, తిప్పన్న తదితరులు సోమవారం ఆదోని మున్సిపల్ కార్యాలయం ఎదుట వికలాంగులతో కలిసి ధర్నా నిర్వహించి కమిషనర్‌కు వినతి పత్రం అందించారు.

శ్రీమఠంలో కర్ణాటక సీబీఐ కోర్టు జడ్జి



పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులతో పర్యటిస్తున్న న్యాయమూర్తి గజానన్ భట్

మంత్రాలయం : రాఘవేంద్రస్వామి దర్శనార్థం కర్ణాటక సీబీఐ కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి గజానన్ భట్ సోమవారం మంత్రాలయం విచ్చేశారు. ముందుగా గ్రామ దేవత మంచాలమ్మకు అర్చన సహిత హారతులు పట్టి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం రాఘవేంద్రుల మూల బృందావనాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసుకున్నారు. ఈ సందర్భంగా పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు రాఘవేంద్రుల జ్ఞాపిక, శేష వస్త్రం అందజేసి ఫల, పూల, మంత్రాక్షింతలతో ఆశీర్వదించారు. దర్శనానంతరం పీఠాధిపతితో కలిసి క్షేత్రంలో పర్యటించారు. సీఐ రామాంజులు, ఎస్ఐ శివాంజల్ ఉన్నారు.

మూల్యాంకనం సరళతరం చేయాలి

ఎమ్మిగనూరుటౌన్: పాఠశాలల్లో రాష్ట్ర ప్రభుత్వం నూతన మూల్యాంకనంలో భాగంగా ప్రవేశపెట్టిన అసెస్మెంట్ పుస్తకాలతో సమయం వృథా అవుతుందని, అసెస్మెంట్‌లోని అసంబద్ధాలను తొలగించి మూల్యాంకనం సరళతరం చేయాలని ఎస్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి టీకే.జనార్దన, రాష్ట్ర ఉపాధ్యక్షులు వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక ఎస్‌టీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో ఎస్‌టీయూ నాయకులు బసవరాజు, ప్రసన్నరాజు, నాగరాజు, వెంకట్రాముడు తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలను తొలగించకండి

ఎమ్మిగనూరుటౌన్: వార్డు సచివాలయాల్లో పని చేసే ఎడ్యుకేషన్, డేటా ప్రాసెసింగ్ సెక్రటరీలకు వారి పని బాధ్యతల నుంచి తొలగించి మరో శాఖ సెక్రటరీలకు అప్పగించవద్దని ఆయా విభాగాల సెక్రటరీలు హంపిరెడ్డి, రియాజ్, కుమార్, వీరేష్, నవీన్ కోరారు. సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ గంగిరెడ్డికి వినతి పత్రం ఇచ్చారు.

అంబేడ్కర్ భవన్ నిర్మించాలి

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భవనాని కోసం కేటాయించిన స్థలంలో భవన నిర్మాణ పనులు చేపట్టాలని, స్థానిక రిక్రియేషన్ క్లబ్ ఎదురుగా బాబా జగ్జీవన్‌రాం విగ్రహన్ని ఏర్పాటు చేయాలంటూ దళిత,ప్రజా సంఘాలు సోమవారం పట్టణంలో పెద్ద ఎత్తున ర్యాలీ చేపట్టాయి. మున్సిపల్ కార్యాలయం వద్ద ఆయా సంఘాల నాయకులు బైఠాయించి కమిషనర్ గంగిరెడ్డికి వినతి పత్రం అందించారు. కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు దేవసహాయం, అంబేడ్కర్ భవన సాధన కమిటీ నాయకులు కదిరికోట ఆదెన్న, ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర కార్యదర్శి ఆనంద్ చైతన్య, మాల మహానాడు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పండుగలను భవిష్యత్ తరాలకు అందించాలి



మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్

ఆదోని అర్బన్: మనం జరుపుకునే పండగలను భవిష్యత్ తరాలకు అందించాలని జిల్లా ఎస్పీ విక్రాంత్‌పాటిల్ అన్నారు. సోమవారం పట్టణంలోని మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో హిందూ, ముస్లిం మతపెద్దలతో పీస్ మీటింగ్ నిర్వహించారు. అలాగే వివిధ శాఖల అధికారులతో చవితి, నిమజ్జనం రోజున ఏర్పాట్లపై చర్చ సమావేశం జరిగింది. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ చవితి, నిమజ్జనం వేడుకలు వైభవంగా జరిగేలా చూసుకుంటామని, ఇందుకు ప్రతిశాఖ వారు, ప్రజలు, భక్తులు, మండపాల నిర్వాహకులు, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, మతపెద్దలు సహకరించాలన్నారు. సోషల్ మీడియాలో రెచ్చగొట్టే పోస్టులు పెట్టొద్దని, పుకార్లను నమ్మి ప్రజలు భయభ్రాంతులకు గురికావొద్దని సూచించారు. పెద్ద మండపాల వద్ద సీసీ కెమెరాలు నిర్వాహకులు ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి మండపం వద్ద రాత్రివేళల్లో నిర్వాహకుల్లో ఒక్కరైనా ఉండాలన్నారు. ఇరువర్గాల వారు పండగను సంప్రదాయబద్ధంగా ప్రశాంత వాతావరణం జరుపుకుని విజయవంతం చేయాలని కోరారు. ఐదు రోజుల పాటు జరిగే ఉత్సవాల్లో రోజురోజుకు పోలీస్ బందోబస్తు పెంచుతామన్నారు. నిమజ్జనోత్సవం రోజున జిల్లా పోలీస్ యంత్రాంగం ఇక్కడ బందోబస్తులో ఉంటుందన్నారు.

ప్రశాంత వాతావరణంలో పండగ జరిగేలా చూడాలి

అన్నిశాఖల అధికారులు వారివారి పనులను సమర్థవంతంగా నిర్వహించి ప్రశాంత వాతావరణంలో పండగను జరిగేలా చూడాలని సబ్‌కలెక్టర్ మౌర్యభరద్వాజ్ అన్నారు. సమన్వయంగా ఉత్సవాన్ని విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో ఏఎస్పీ హుసేన్‌పీరా, డీఎస్పీ హేమలత, మున్సిపల్ చైర్‌పర్సన్ లోకేశ్వరి, రజక కార్పొరేషన్ చైర్మన్ సావిత్రి, సీఐలు శ్రీరామ్, రాజశేఖర్‌రెడ్డి, రామలింగమయ్య, ఎస్ఐలు పాల్గొన్నారు.

వేడుకలు ప్రశాంతంగా జరుపుకోవాలి

ఎమ్మిగనూరురూరల్: వినాయక చవితి వేడుకలను ప్రశాతంగా జరుపుకోవాలని ఎమ్మిగనూరు డీఎస్పీ ఎంఎన్. భార్గవి అన్నారు. సోమవారం స్థానిక పట్టణ పోలీస్‌స్టేషన్ అవరణలో పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లా పట్టణంలో 3 రోజులు పాటు జరిగే వేడుకలను సంతోషంగా జరుపుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. సమావేశంలో టౌన్ సీఐ వి. శ్రీనివాసులు, టౌన్ ఎస్ఐ మధుసూదన్‌రెడ్డి, ట్రాఫిక్ ఎస్ఐ ఎర్రన్న, పీస్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నందవరం : వినాయక చవితి వేడుకల్లో ప్రతి ఒక్కరూ శాఖాపరమైన నిబంధనలు పాటించాలని ఎస్ఐ కేశవ సూచించారు. సోమవారం మండలంలోని ఆయా గ్రామాల వినాయక మండలి సభ్యులు, గ్రామ పెద్దలతో సమావేశం నిర్వహించారు.

కోసిగి: సర్కిల్ పరిధిలో వినాయక విగ్రహాలకు మూడు రోజుల పాటు మాత్రమే అనుమతి ఇస్తున్నట్లు ఎఐ మంజునాథ్ తెలిపారు. సోమవారం కోసిగిలో వినాయక మిత్ర మండలి సభ్యులతో ఎస్ఐ హనుమంత రెడ్డితో కలిసి ప్రత్యేక సమావేశం నిర్వహించారు.

విశ్వశాంతి యాగానికి భూమిపూజ

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలో అక్టోబర్ 3 నుంచి 18వ తేదీ వరకు నిర్వహించనున్న 87వ విశ్వశాంతి మహాయాగ మహోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం స్థానిక వైడబ్ల్యూసీఎస్ మైదానంలో వేద పండితులు భూమిపూజ చేశారు. శ్రీకృష్ణ జ్యోతి స్వరూపానంద స్వామి ఆధ్వర్యంలో వేద పండితులు యాగ శాల మండప నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. నిర్వాహకులు సత్యనారాయణ రెడ్డి, కేఆర్ నటరాజ్ రెడ్డి, మాచాని నాగరాజు, లక్ష్మిరెడ్డి పాల్గొన్నారు.

క్రీడా దుస్తుల పంపిణీ

ఆదోని రూరల్: మండలంలోని పెద్దతుంబలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కబడ్డీ క్రీడాకారిణులకు సోమవరం హిందీ ఉపాధ్యాయురాలు నయనాకుమారి హెచ్ఎం మారుతీప్రియ ఆధ్వర్యంలో క్రీడా దుస్తులను అందించారు. విద్యార్థినులు క్రీడల్లో రాణించి మంచి పేరు తేవాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సూర్యనారాయణ, పీఈటీ నరసింహరాజు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్లపై చర్యలు తీసుకోవాలి



ఎస్ఐ కేశవకు వినతి పత్రం అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

నందవరం : దివ్యాంగుల పింఛన్ తొలగించేందుకు కారణమైన డాక్టర్లపై చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర రైతు విభాగ అధికార ప్రతినిధి గడ్డం నారాయణ రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలోని స్థానిక పోలీస్ స్టేషన్‌లో దివ్యాంగుల పింఛన్లు తొలగించేందుకు కారణమైన డాక్టర్లపై విచారణ జరిపి కేసు నమోదు చేయాలని కోరుతూ ఎస్ఐ కేశవకు వైఎస్సార్‌సీపీ నాయకులు ఫిర్యాదు పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. రెండు దశాబ్దాలుగా ప్రభుత్వ వైద్యాధికారుల బృందాలు ద్వారా 60, 80, 100 శాతం వైకల్యం ఉన్నట్లు ధ్రువీకరించి ఇచ్చిన ధ్రువపత్రాల ఆధారంగా వందలాది మంది పింఛన్లు పొందుతున్నారని వివరించారు. అయితే కూటమి ప్రభుత్వం నోటీసులు జారీ చేసి వైకల్యం 40 శాతం కంటే తక్కువ ఉందని తొలగించడం దారుణమన్నారు. దివ్యాంగులకు రెండు రకాల సందరం సర్టిఫికెట్లు మంజూరు చేస్తున్న డాక్టర్‌పై విచారణ జరిపి, పింఛన్ తొలగింపు కారణమైన డాక్టర్లపై పోలీసులు కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ప్రచార విభాగం అధ్యక్షుడు చాంద్‌బాషా, మండల కార్యదర్శి బోయ వెంకటేష్, జిల్లా విద్యార్థి విభాగపు ప్రధాన కార్యదర్శి ప్రకాష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముస్లిం శ్మశాన వాటికకు స్థలం కేటాయించాలి

గోనెగండ్ల : మండల కేంద్రం గోనెగండ్లలో ముస్లింల శ్మశాన వాటికకు స్థలం కేటాయించాలని గోనెగండ్ల ముస్లింలు ఎస్ఎస్ మాబువలి, యూనుస్, జలీల్ కోరారు. ఈ మేరకు సోమవారం తహసీల్దార్ రాజేశ్వరికి వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ గ్రామంలోని పురాతన శ్మశాన వాటిక నిండిపోయిందని, ఎవరైనా చనిపోతే అంత్యక్రియలు చేయడానికి స్థలం లేదన్నారు. కార్యక్రమంలో మహమ్మద్, రంజాన్, రహంతుల్లా తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

మంత్రాలయం రూరల్ : మండలంలోని మాధవరం పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపిన మేరకు వివరాలు.. మండలంలోని దిబ్బనదొడ్డి గ్రామానికి నైరుతి దిశలో రెండు కి.మీ. దూరంలో గుర్తు తెలియని వ్యక్తి చెట్టుకు ఉరి వేసుకుని చనిపోయాడు. మృతుడి వయసు 40–45 వరకు ఉంటుందని, తెల్ల చొక్కా, ఉదారరంగు ప్యాంట్, తెల్లటి బనియన్ ధరించి ఉన్నాడని చెప్పారు. చెట్టు వద్ద ఒక నల్లటి బ్యాగు ఉందన్నారు. 52–బసాపురం గ్రామ వీఆర్వో మల్లికార్జున ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.